క్లుప్తంగా

అమ్మవారికి ఆభరణాల అందజేత



కూచిపూడి(మొవ్వ): మొవ్వ మండలం కూచిపూడిలోని నాట్యాచార్యుల ఇలవేల్పు శ్రీ బాలా త్రిపురసుందరీ సమేత రామలింగేశ్వరస్వామికి రూ.1.12 లక్షల విలువగల ఆభరణాలను శుక్రవారం దాతలు అందజేశారు. ప్రవాస భారతీయులు పాలడుగు చరణ్ కాసులపేరు, జడలను ఆలయ పాలకమండలి కార్యదిర్శ భాగవతుల బాలకృష్ణ సాలిగ్రామ దండను దేవాలయ పాలక మండలి అధ్యక్ష, ఉపాధ్యక్షులు కావూరి భానుమూర్తి, పసుమర్తి నారాయణ మూర్తికి అందజేశారు. కార్యక్రమంలో సంయుక్త కార్యదర్శి శరత్‌చంద్ర, డాక్టర్ చింతా రవిబాలకృష్ణ, జోశ్యుల నాగ జగన్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు



పామర్రు: వరి సాగులో నీటి యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని పామర్రు ఏడీఏ స్వర్ణలత పేర్కొన్నారు. పామర్రులో నిర్వహించిన పొలంబడి కార్యక్రమంలో ఏడీఏ మాట్లాడారు. వరి సాగులో ప్రస్తుతం నాట్లు దశ పూర్తయిందన్నారు. ఈ సమయంలో వరి పంటకు నీటి తడులను ఇవ్వాలన్నారు. వరి పంటకు అదనపు బలం చేకూర్చేందుకు యూరియా, డీఏపీ వంటి వాటిని పొలంలో చల్లాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ శివనాగరాణి, వీఏఏలు పాల్గొన్నారు.

వీరాంజనేయస్వామి దేవస్థానం మాజీ చైర్మన్ మృతి



పామర్రు: ఉండ్రపూడి–పోలవరం అడ్డరోడ్డు వద్ద ఉన్న శ్రీ వీరాంజనేయస్వామి దేవస్థానం ట్రస్టు బోర్డు మాజీ చైర్మన్ దాసు గంగాధరరావు(68) శుక్రవారం మృతి చెందారు. ఆయన కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఇంటి వద్దనే ఉంటూ వైద్య సేవలను పొందుతున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఆయన మృతి చెందారు. గంగాధరరావు మృతిపై గ్రామస్తులు, ఆలయ సిబ్బంది తమ ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు.

రేపు మెగా వైద్యశిబిరం

గుడివాడ టౌన్: రోటరీక్లబ్ ఆఫ్ గుడివాడ ఆధ్వర్యంలో ఆదివారం మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ప్రోగ్రామ్ కన్వీనర్ సి. సూర్యచంద్రరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక కోతిబొమ్మ సెంటర్ వద్ద గల ప్రభావతి గార్డెన్స్‌లో పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాల వైద్యబృందం ఉచిత పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మెదడు, వెన్నెముక, గుండె, నరాలు, ఇతర సహజ వ్యాధులకు పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు.

ఖాళీ స్థలాల్లో చేరిన మురుగు నీటితో ఇబ్బందులు



పామర్రు: స్థానిక కోటిరెడ్డి పేటలో నివాస గృహాల మధ్యన ఉన్న ఖాళీ స్థలాలతో స్థానిక ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ ఖాళీ స్థలాల్లో మురుగునీరు నిల్వ ఉండటంతో ఆ ప్రాంతం అంతా పందులు స్వైర విహారం చేస్తున్నాయి. దోమలు కూడా పెరగడంతో ప్రజలు అనారోగ్యాలబారిన పడుతున్నారు. ఈ విషయమై పంచాయతీ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

చురుగ్గా రహదారుల నిర్మాణం



ముదినేపల్లి రూరల్: మండలంలోని గురజ పంచాయతీ పరిధిలో అంతర్గత రహదారుల నిర్మాణం చురుగ్గా కొనసాగుతోంది. పంచాయతీ పరిధిలో గతంలో అంతర్గత రోడ్లు అధ్వానంగా ఉండగా అప్పటి ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్)ను రహదారుల సమస్య పరిష్కరించాలని గ్రామ ప్రజలు కోరారు. ఈ మేరకు దూలం నాగేశ్వరరావు సర్పంచ్ మంచాల సరస్వతికి సూచనలు చేసి రహదారుల నిర్మాణం చేపట్టాలన్నారు. పంచాయతీ నిధులు, ఆర్థిక సంఘం నిధులతో గ్రామంలో ఎనిమిది అంతర్గత రోడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టగా పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఈ పనులను త్వరిత గతిన పూర్తి చేసేందుకు సర్పంచ్‌తో పాటు వైఎస్సార్ సీపీ నాయకులు పర్యవేక్షణ చేస్తున్నారు. సాధ్యమైనంత తొందరలోనే రోడ్ల నిర్మాణాన్ని పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తామని సర్పంచ్ తెలిపారు.

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీవ్రత పూజలు



కైకలూరులో శ్యామలాంబ ఆలయ క్యూలో భక్తులు



పామర్రులోని వల్మీకేశ్వరీ అమ్మవారు



పామర్రులోని పర్వతవర్ధనీదేవి ప్రత్యేక అలంకారం



మండవల్లి విజయదుర్గాదేవి ఆలయంలో మహాలక్ష్మీదేవిగా అమ్మవారు



గుడివాడ సత్యనారాయణ స్వామి ఆలయంలో కుంకుమార్చన నిర్వహిస్తున్న భక్తులు

మండవల్లి: మండలంలోని మండవల్లి, కానుకొల్లు, లింగాల, పెరికెగూడెం, కొర్లపాడు, భైరవపట్నం, లోకుమూడి గ్రామాల్లో వరలక్ష్మీ వ్రతాలు శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో ఆలయాలకు వెళ్లి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక విజయదుర్గాదేవి ఆలయంలో అమ్మవారిని మహాలక్ష్మీదేవిగా ఆలయ అర్చకుడు శ్రీనివాస్ అలంకరించారు. గృహాలలో మహిళలు లక్ష్మీ దేవి ప్రతిమను ఏర్పాటు చేసి, ప్రత్యేక అలంకరణతో పూజలు నిర్వహించారు.

పెదపారుపూడిలో..

పెదపారుపూడి: మండలంలోని అన్ని గ్రామాల్లో మహిళలు ఇంటి వద్ద శుక్రవారం వరలక్ష్మీ దేవి వ్రతాలు ఘనంగా జరుపుకున్నారు. ఇంటిలో లక్ష్మీ దేవిగా కొత్త చీర, బంగారపు రూపు పెట్టుకుని భక్తి శ్రద్ధలతో వ్రతాలు చేశారు. మండలంలోని వానపాముల రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఉన్న పార్వతి అమ్మవారిని అధిక సంఖ్యలో మహిళలు దర్శించుకున్నారు.

కైకలూరులో..

కైకలూరు: వరలక్ష్మీవ్రత పూజలను మహిళలు భక్తి శ్రద్ధలతో శుక్రవారం నిర్వహించారు. మండలంలోని పలు ఆలయాల్లో ఉదయం, సాయంత్రం భక్తుల రద్దీ పెరిగింది. కైకలూరు శ్యామలాంబ ఆలయంలో పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రముఖ న్యాయవాది శ్రీనివాసరావు అమ్మవారికి పుష్పాలంకరణ చేయించారు. అదేవిధంగా భక్తులకు ఉచిత ప్రసాద దాతలుగా బచ్చు నాగ వెంకటమురళీకృష్ణ, చక్కా శ్యామలరావు, ముంగర ఏడుకొండలు, అన్నం వెంకట సీతారాంబాబు, నిమ్మగడ్డ అశోక్, హేమంత్, గోళ్ల కొండ వ్యవహరించారు. ఆలయ ఈఓ వీఎన్‌కే శేఖర్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పామర్రులో..

పామర్రు: శ్రావణమాసం రెండో శుక్రవారం వరలక్ష్మీవ్రతం కావడంతో భక్తులు అందరూ ఉదయం తమ ఇళ్ల వద్ద వరలక్ష్మీదేవి పూజలను చేసుకున్నారు. సాయంత్రం నుంచి భక్తులు గ్రామంలోని అన్ని ఆలయాల్లోని అమ్మవార్లను దర్శించుకుని పూజలు చేశారు. స్థానిక వేణుగోపాలస్వామి ఆలయంలోని రాజ్యలక్ష్మి అమ్మవారిని, సోమేశ్వర స్వామి ఆలయంలోని పార్వతి అమ్మవారిని, బుచ్చమ్మ ఆశ్రమంలోని పర్వత వర్ధనీదేవిని దర్శించుకున్నారు. జమ్మిచెట్టు వద్ద ఉన్న పాతాళేశ్వరీ అమ్మవారి ఆలయంలో, అంకమ్మతల్లి ఆలయంలో, కన్యకా పరమేశ్వరీ అమ్మవారి ఆలయాలలోని అమ్మవార్లకు భక్తులు శ్రావణ శుక్రవారం పూజలు నిర్వహించారు.

సామూహిక లక్ష్మీదేవి కుంకుమార్చన

గుడివాడ టౌన్: స్థానిక కోతిబొమ్మ సెంటర్‌లోని శ్రీరామ సహిత వీర వెంకట సత్యనారాయణ స్వామి దేవస్థానంలో శుక్రవారం సామూహిక లక్ష్మీదేవి కుంకుమార్చన నిర్వహించారు. తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ ప్రత్యేక కార్యక్రమంలో 108 మంది మహిళలు పాల్గొని అర్చన చేశారు. కార్యక్రమంలో వంశపారంపర్య ధర్మకర్త గుడే లక్ష్మీ రంగనాయకమ్మ, మాదాసు వెంకట లక్ష్మీ కుమారి, తిరుమల తిరుపతి దేవస్థానం ధర్మాచార్య కావూరి శ్రీధర్ పాల్గొన్నారు.

గౌతు లచ్చన్న పోరాటపటిమను మరువలేం



కొత్తవరంలో గౌతు లచ్చన్న విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు



వల్లూరుపాలెంలో గౌతు లచ్చన్న విగ్రహానికి గ్రామస్తుల నివాళి

తోట్లవల్లూరు: బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతే లక్ష్యంగా ముందుకు సాగిన సర్దార్ గౌతు లచ్చన్న పోరాటపటిమను ఎన్నటికీ మరువలేమని బీసీ నాయకుడు లుక్కా వెంకట శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని రొయ్యూరు, వల్లూరుపాలెం, తోట్లవల్లూరు గ్రామాల్లో మాజీ మంత్రి, బీసీల ఆరాధ్యదైవం గౌతు లచ్చన్న జయంతి శుక్రవారం ఘనంగా జరిగింది. రొయ్యూరులో లచ్చన్న విగ్రహానికి సర్పంచ్ నిమ్మగడ్డ ప్రభుదాస్, లుక్కా వెంకట శ్రీనివాసరావు పూలమాల వేసి నివాళులర్పించారు. వల్లూరుపాలెంలో కొనకాల వాసు, చెన్నుపాటి శ్రీధర్, పలువురు బీసీలు నివాళులర్పించారు. తోట్లవల్లూరులో గొరిపర్తి గోపయ్య, నెక్కలపూడి మురళి, వల్లూరు రాంబాబు, కఠారి శంకర్, తదితరులు నివాళులర్పించారు.

గుడ్లవల్లేరులో..

గుడ్లవల్లేరు: కొతవరంలో సర్దార్ గౌతు లచ్చన్న జయంతి ఉత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లచ్చన్న విగ్రహానికి రాష్ట్ర గౌడ సంఘ నాయకుడు కొనకళ్ల బుల్లయ్య పూలమాల వేసి నివాళులర్పించారు. టీడీపీ నాయకులు వల్లభనేని బాబూరావు, కృష్ణారావు, దేశపతి, సుబ్రహ్మణ్యం, నరసింహారావు, పోతురాజు, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

గౌతు లచ్చన్న సేవలు చిరస్మరణీయం

కైకలూరు: దేశ చరిత్రలో సర్దార్ గౌతు లచ్చన్న చేసిన సేవలు చిరస్మరణీయమని పలువురు వక్తలు కొనియాడారు. కైకలూరు తాలూకా సెంటర్‌లో లచ్చన్న జయంతిని బీజేపీ మండలాధ్యక్షుడు కట్టా వీర రాఘవులు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ వేంపాటి విష్ణురావు, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు కీర్తి రాంప్రసాద్, ఓబీసీ మోర్చా కార్యదర్శి బొల్లా శ్యామల రాజు, పులపర్రు, ఆచవరం సర్పంచులు వేంద్ర నాగరాజు, కట్టా నాగరాజు గౌడ్ పాల్గొన్నారు.

బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి గౌతు లచ్చన్న

కైకలూరు: బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి అహర్నిశలూ కృషి చేసిన మహోన్నత వ్యక్తి గౌతు లచ్చన్న అని గౌడ సంఘ రాష్ట్ర నాయకులు పోసిన చెంచు రామారావు, నియోజకవర్గ టీడీపీ అధ్యక్షుడు వీరమల్లు నరసింహారావులు పేర్కొన్నారు. కైకలూరు తాలూకా సెంటర్‌లో లచ్చన్న జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి నియోజకవర్గ నాయకులు శుక్రవారం నివాళులర్పించారు. పలువురు మాట్లాడుతూ లచ్చన్న జయంతిని ప్రభుత్వం అధికారకంగా చేయాలన్నారు. పోసిన పాపారావు గౌడ్, సాహితీవేత్త చింతపల్లి వెంకట నారాయణ, బొల్లా శ్యామలరాజు గౌడ్, టీడీపీ మండల అధ్యక్షుడు పెనుమత్స త్రినాథరాజు, మోదుగుమూడి లక్ష్మయ్య పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి



విద్యార్థులకు బహుమతులను అందజేస్తున్న ఎమ్మెల్యే కుమార్‌రాజా

కనుమూరు(పామర్రు): చదువుతోపాటుగా విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. మండలంలోని కనుమూరు గ్రామం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు శుక్రవారం బహుమతులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్వాతంత్ర్యదినోత్సవం సందర్భంగా విద్యార్థులకు ఆటల పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను ప్రదానం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో స్థానికులు దగ్గుపాటి ఫణికుమార్, జగ్గారావు, ఎంఈఓ–2 పద్మవాణి పాల్గొన్నారు.

నాణ్యమైన మందులను ప్రజలకు అందించాలి

పామర్రు: ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటూ 24/7 సేవలను అందించాలని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. స్థానిక బందరు రోడ్డులో సాదియా మెడికల్ జనరల్‌స్టోర్సును శుక్రవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నాణ్యమైన మందులను, మన్నికైన వస్తువులను ప్రజలకు అందించాలన్నారు. కార్యక్రమంలో నేతలు గొట్టిపాటి లక్ష్మీదాసు, వెంకటేశ్వరరావు, వెంకటరత్న గిరిబాబు, గణేష్, ప్రవీణ్, వీరాంజనేయులు పాల్గొన్నారు.

ప్రతిభకు పట్టం



జేసీ నుంచి అవార్డు అందుకుంటున్న ఏఈ అట్లూరి, వీఆర్వో సుబ్బారావు

గుడివాడరూరల్: గుడివాడ మండల ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అట్లూరి వెంకటేశ్వరరావు చేసిన సేవలకు స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉత్తమ అవార్డుకు ఎంపికయ్యారు. జాయింట్ కలెక్టర్ గీతాంజలిశర్మ నుంచి అట్లూరి అవార్డు అందుకున్నారు. అదేవిధంగా లింగవరం వీఆర్వో కొల్లూరి సుబ్బారావు కూడా ఉత్తమ అవార్డును అందుకున్నారు.

ఏఎన్‌ఎం రాణికి పురస్కారం



మంత్రి పార్థసారథి నుంచి పురస్కారం అందుకుంటున్న రాణి

ముదినేపల్లి రూరల్: ఏఎన్‌ఎంగా ఉత్తమ సేవలందించిన నిమ్మగడ్డ ఎలినా రాణికి ప్రభుత్వ ప్రతిభా పురస్కారం దక్కింది. స్థానిక పీహెచ్‌సీలో ఏఎన్‌ఎంగా పని చేస్తున్న నిమ్మగడ్డ ఎలినా రాణి సేవలను గుర్తించిన ప్రభుత్వం స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రతిభా పురస్కారానికి ఎంపిక చేసింది. ఈ మేరకు ఏలూరు పరేడ్ గ్రౌండ్స్‌లో గురువారం నిర్వహించిన సమావేశంలో గృహ నిర్మాణ, సమాచారశాఖ మంత్రి కొలుసు పార్థసారథి, కలెక్టర్ వెట్రిసెల్వీ చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకుంది.

ఉత్తమ ఏఈగా నాగబాబు



కైకలూరు: ఆర్‌డబ్ల్యూఎస్ శాఖలో ఉత్తమ పనితీరు కనబర్చిన కైకలూరు ఏఈ బి.నాగబాబుకు ఏలూరు పంద్రాగస్టు వేడుకల్లో జిల్లా మంత్రి కొలుసు పార్థసారథి, కలెక్టర్ వెట్రిసెల్వి చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కలిదిండి(కైకలూరు): విద్యుత్ సబ్‌స్టేషన్ల మరమ్మతుల నిమిత్తం శనివారం ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండబోదని విద్యుత్ శాఖ ఈఈ పి.రామకృష్ణ శుక్రవారం తెలిపారు. కలిదిండి మండలం కలిదిండి, పోతుమర్రు, మూలలంక, కాళ్లపాలెం, కైకలూరు మండలం వరహాపట్నం 33/11 కేవీ సబ్‌స్టేషన్ల మరమ్మతుల నిమిత్తం ఆ స్టేషన్ల పరిధి గ్రామాల్లో విద్యుత్ ఉండబోదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

19న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

గుడివాడరూరల్: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 19న నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎ.వెంకటరమణ శుక్రవారం తెలిపారు. సోమవారం మధ్యాహ్నం రెండు గంటలకు ఎంపీపీ గద్దే పుష్పరాణి అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సమావేశానికి మండలంలోని ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు, సిబ్బంది హాజరు కావాలని ఆమె కోరారు.

సమస్యల పరిష్కారంపై దృష్టి

గుడ్లవల్లేరు: గ్రామ పరిధిలోని ప్రజలు తమ వ్యక్తిగత, సామాజిక సమస్యలపై వస్తే సత్వరమే ఆ సమస్యల పరిష్కారంపై ఉద్యోగులు దృష్టి సారించాలని ఎంపీడీఓ డి.కృష్ణవేణి అన్నారు. గుడ్లవల్లేరులోని రెండు గ్రామ సచివాలయాలను శుక్రవారం ఆమె పరిశీలించారు. గ్రామ కార్యదర్శి నరసింహారావు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు

గుడివాడరూరల్: రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని గుడివాడ తాలూకా ఎస్‌ఐ ఎన్.చంటిబాబు పేర్కొన్నారు. మండలంలోని మల్లాయపాలెం క్రాస్‌రోడ్డు వద్ద ఇటీవల అధికంగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాల నివారణకు ఆర్టీఓ కార్యాలయ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎం.సంగీతరావు, ఆర్‌అండ్‌బీ అధికారులతో కలసి ఆ ప్రాంతాన్ని శుక్రవారం పరిశీలించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ఆ ప్రాంతంలో తీసుకోవాల్సిన చర్యలు, చేపట్టాల్సిన జాగ్రత్తలను ఆర్‌అండ్‌బీ అధికారులకు ఎస్‌ఐ, ఎంవీఐలు సూచించారు. ప్రమాదాల నివారణకు సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని వారు కోరారు. దీనికి సానుకూలంగా స్పందించిన ఆర్‌అండ్‌బీ అధికారులు వీలైనంత త్వరగానే ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



పుస్తకాలు పంపిణీ చేస్తున్న రాజేంద్రప్రసాద్

ముదినేపల్లి రూరల్: మండలంలోని పెయ్యేరు ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శుక్రవారం పుస్తకాలు పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన ప్రముఖుడు వీరాస్వామి ఆధ్వర్యంలో విద్యార్థులకు నోటు పుస్తకాలతో పాటు క్రీడా సామగ్రిని అందజేశారు. వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు జాస్తి బాబురాజేంద్ర ప్రసాద్, సర్పంచ్ అల్లు సుశీల, మాజీ సర్పంచ్ దుక్కిపాటి శేషుబాబు, హెచ్‌ఎం బేతాల రాజేంద్రప్రసాద్, ఉపాధ్యాయుడు సీహెచ్ చక్రధర్ పాల్గొన్నారు.

ఎనిమిది మంది జూదరుల అరెస్ట్



కూచిపూడి పోలీసుల అదుపులో జూదరులు

కూచిపూడి(మొవ్వ): మొవ్వ గ్రామంలో కొంతమంది వ్యక్తులు చిత్తులాట ఆడుతున్నారని వచ్చిన సమాచారం మేరకు కూచిపూడి ఎస్‌ఐ ఎం.సుబ్రహ్మణ్యం తన సిబ్బందితో మెరుపు దాడి నిర్వహించి ఎనిమిది మంది జూదరులను అరెస్ట్ చేశారు. ఎస్‌ఐ కథనం మేరకు శుక్రవారం మొవ్వలోని బహిరంగ ప్రదేశంలో డబ్బులు పెట్టి పెందెం ఆడుతుండగా జూదరులను పట్టుకున్నారు. వీరి వద్ద నుంచి రూ.4,790ను స్వాధీనం చేసుకున్నారు. ఎనిమిది మందిపై కేసు నమోదు చేసి, కోర్టుకు హాజరు పరచనున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆక్రమణలు తొలగించండి సారూ..



భవనం ఎదురుగా ఏర్పాటు చేసిన బారికేడ్లు

గుడివాడ టౌన్: పట్టణంలోని చిరు వ్యాపారులపై హుకుం జారీ చేస్తున్న ట్రాఫిక్ పోలీసులు బడాబాబుల ఆక్రమణలు పట్టించుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. స్థానిక విజయవాడ రోడ్‌లోని ఏజీకే మున్సిపల్ హైస్కూల్ ఎదురుగా ఉన్న ఓ ప్రైవేట్ ఆస్పత్రి ముందు ఇనుప బారికేడ్లను పోలీసుల పేరుతో తయారు చేయించి రోడ్డును ఆక్రమించారు. అటుగా వస్తున్న ప్రయాణికులు ఈ బారికేడ్లను ట్రాఫిక్ పోలీసుల సౌకర్యార్థం వితరణకు ఏర్పాటు చేశారని తొలుత భావించారు. అవి ఏర్పాటు చేసి రోజులు గడుస్తున్నా వాటిని తొలగించకపోవడంపై ప్రజలకు అనుమానం కలిగింది. వీటిని క్షుణ్ణంగా పరిశీలిస్తే ఒకదానికి ఒకటి ఇనుప గొలుసులతో కట్టేసి, ఆస్పత్రి ముందు ఎవరూ వాహనాలు నిలుపకుండా ఉండేందుకు ఏర్పాటు చేసినట్లు తెలిసింది. ఆస్పత్రి భవనానికి ముందు డ్రెయిన్ నుంచి సుమారు ఏడు అడుగుల రోడ్డును ఆక్రమించి బారికేడ్లు ఏర్పాటు చేయడంతో ట్రాఫిక్‌కు పూర్తి అంతరాయం కలుగుతోంది. ఆస్పత్రికి వచ్చే వారి వాహనాలు రోడ్డుపైనే నిలిపివేయడంతో ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. తక్షణమే వాటిని తొలగించి ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలుగకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

వీధిలైట్లు తప్పనిసరి



వీధి లైట్లు వేసే ప్రక్రియను పరిశీలిస్తున్న సర్పంచ్ ఝాన్సీ

మండవల్లిలో శుక్రవారం సర్పంచ్ మెండా ఝాన్సీ వీధి లైట్లు వేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వీదిలైట్లు తప్పనిసరని పేర్కొన్నారు. రాత్రి వేళల్లో వీధి లైట్లు వెలగకుంటే క్రిమి కీటకాలు, పాములు తిరుగాడే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు మెండా సురేష్ పాల్గొన్నారు.

– మండవల్లి

వాజ్‌పేయికి ఘన నివాళులు



కైకలూరులో వాజ్‌పేయి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

గుడివాడ టౌన్: మాజీ ప్రధాని అటల్ బిహారి వాజ్‌పేయి వర్ధంతి సందర్భంగా స్థానిక బీజేపీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు గుత్తికొండ శ్రీరాజబాబు ఆధ్వర్యంలో నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామినేని వెంకట కృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి అంగడాల సతీష్, సూరే గాంధి, పట్టణ అధ్యక్షుడు ఎర్రపోతు అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

కైకలూరులో..

కైకలూరు: మాజీ ప్రధాని, భారతరత్న అటల్ బిహారీ వాజ్‌పేయి ఆదర్శనీయులు అని బీజేపీ నేతలు కొనియడారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ప్రాంగణంలో బీజేపీ మండల అధ్యక్షుడు కె.వీరరాఘవులు ఆధ్వర్యంలో వాజ్‌పేయి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ వేంపాటి విష్ణురావు, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు కీర్తి రాంప్రసాద్, ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శి శ్యామలరాజు, రాంబాబు, వేములవాడ వెంకట సుబ్బారావు, పోలగాని మహాలక్ష్ముడు పాల్గొన్నారు.

భైరవపట్నం యూపీ స్కూల్‌కు కంప్యూటర్ల వితరణ



విద్యార్థులకు అందజేసిన కంప్యూటర్లు

మండవల్లి: మండలంలోని భైరవపట్నం ప్రాథమికోన్నత పాఠశాలకు రూ.60 వేలు విలువ చేసే నాలుగు కంప్యూటర్లను హెచ్‌ఎం ఎస్‌వీబీ సుబ్రహ్మణ్యానికి ఓల్డ్ స్టూడెంట్స్, ఇతరుల సహకారంతో శుక్రవారం అందజేశారు. కంప్యూటర్లను అందజేసిన వారిని సర్పంచ్ ఎస్.రాధ నాగేంద్రరావు, ఎంపీటీసీ సభ్యుడు కిరీటి రాజు, ఎంఈఓ–2 రత్నసునాదం అభినందించారు.

నేడు వైద్యశాలల బంద్

కైకలూరు: కోల్‌కతాలోని ఆర్‌జీకర్ ప్రభుత్వ మెడికల్ కాలేజీలో మహిళా డాక్టర్‌ను అత్యాచారం చేసి, హత్య చేసిన ఘటనను నిరసిస్తూ ఆల్ ఇండియా మెడికల్ అసోసియేషన్ పిలుపు మేరకు కైకలూరులో ఆస్పత్రులు శనివారం బంద్ పాటిస్తున్నట్లు ప్రైవేట్ వైద్యులు శుక్రవారం తెలిపారు. అత్యవసర కేసులను చూస్తామని పేర్కొన్నారు. శనివారం ఉదయం 9 గంటల నుంచి ఆదివారం ఉదయం 9 గంటల వరకు బంద్ కొనసాగుతుందని పేర్కొన్నారు. ప్రజలు గమనించాలని కోరారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
గుడివాడ డివిజన్
99516 02865 (గుడివాడ)
99516 02985 (కైకలూరు)
90105 77706 (పామర్రు)
Office mail : sakshiads@gmail.com